కనులపండువగా రథోత్సవం

- స్వర్ణరథంపై ఊరేగిన కరకంతేశ్వర స్వామి
- అలరించిన కోలాటాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దేవరెద్దు



ఆదిదంపతులు ఆశీనులైన స్వర్ణ రథాన్ని లాగుతున్న భక్తులు

నగరి: స్వర్ణకాంతులు చిందే రథంపై కామాక్షిసమేతంగా కరకంతేశ్వరుడు మాడవీధుల్లో విహరించాడు. పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో బుధవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా స్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి సువర్ణశోభితంగా కాంతులీనిన రథంపై కొలువుదీర్చారు. రథ పూజలు నిర్వహించిన అనంతరం హరహర మహదేవ నామ ఘోషాల మధ్య రథోత్సవం ప్రారంభమైంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా స్వామి, అమ్మవారు కొలువుతీరిన రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. రథోత్సవానికి తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో మాడ వీధులు కిటకిటలాడాయి. ఇంటి ముందు నేత్రపర్వంగా రథంపై ఊరేగుతూ వచ్చిన ఆదిదంపతులకు స్థానికులు కొబ్బరికాయలు సమర్పించి, హారతులు పట్టారు. మాడ వీధుల్లో భక్తజనసందోహం నడుమ రథోత్సవం మూడు గంటల పాటు కనుల పండువగా సాగింది. మంగళవాయిద్యాలు, కైలాయ వాయిద్యాలు, శివపురాణ పారాయణం, కోలాటాలు ఊరేగింపు ఆద్యంతం అలరించాయి. రథం ముందుకు వచ్చిన చవటగుంట లక్ష్మీనారాయణ స్వామి ఆలయ దేవరెద్దు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ కోర్కెలు తీర్చాలంటూ దేవరెద్దుకు భక్తులు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మాడవీధుల్లో విహరించి రథం మళ్లీ ఆలయానికి చేరుకోవడంతో రథోత్సవం ముగిసింది. ఆలయం వద్ద భక్తులకు భారీఎత్తున సహపంక్తి భోజనం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో రథం విరాళ దాతలు కోనేరు అమ్మతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, మొదలియార్ సంక్షేమ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దేవరెద్దు



శివపురాణ పారాయణం చేస్తున్న భక్తులు



రథానికి కోలాటాలతో స్వాగతం



అలరించిన కైలాయ వాయిద్యాలు

క్లుప్తంగా

గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేసుకోవాలని మండల వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్ల రసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. అనంతరం 54 మందికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగులకు ఐటీఐ అవకాశం

విజయపురం: ప్రైవేటు పారిశ్రామిక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు ఐటీఐ ప్రవేశానికి ఆహ్వానం పలుకుతున్నట్లు మాధవరం ఐటీఐ ప్రిన్సిపల్ గణేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా ఓ సంస్థలో వివిధ ట్రేడ్‌లలో మూడేళ్ల అనుభవం కలిగి, 21ఏళ్ల వయసు పైబడిన వారు ఈ నెల 12లోపు తగిన ధ్రువపత్రాలతో నేరుగా ఐటీఐ కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 94944 34236, 91770 35120, 99854 61342, 98853 20544ను సంప్రదించాలన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి



ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడుతున్న సుబ్రమణ్యనాయుడు

పాలసముద్రం: మండలంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే ట్రాక్టర్ నడపాలని హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్య నాయుడు తెలిపారు. నీవానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల లైసెన్స్‌లను బుధవారం తనిఖీ చేశారు. కొంత మందికి లైసెన్స్ లేనట్టు గుర్తించారు. వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇక నుంచి ట్రాక్టర్ నడపాలంటే తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, యూనిఫామ్ ఉండాలని హెచ్చరించారు. మైనర్లు ట్రాక్టర్ నడిపితే ట్రాక్టర్ యజమానిపై చర్య తీసుకుంటామని పేర్కొన్నారు. ఇసుక తీసుకొస్తున్నప్పుడు ట్రాక్టర్‌పై టార్పాలిన్ పట్టలు కట్టాలని తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో విద్యావతి

పాలసముద్రం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో విద్యావతి తెలిపారు. ఆమె బుధవారం పాలసముద్రం పంచాయతీలో సర్పంచ్ అయ్యప్ప గ్రామాల్లో చేయిస్తున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేయడం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విస్తరనాధికారి రమేష్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పేడదిబ్బలను తొలగిస్తున్న సిబ్బంది

విజయపురం: మండలంలోని ఆలపాకం వడ్డీ ఇండ్లలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఉదయ్, సర్పంచ్ బాబు సంయుక్తంగా కలిసి బుధవారం పేడదిబ్బలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించారు. మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. చేతిపంపు, కొళాయి చుట్టు బ్లీచింగ్ వేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. పొడి, తడి చెత్తను వేరు వేసి, ఇంటి పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

పుత్తూరు: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పుత్తూరు పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు సూచించారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భవతులకు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా శరీరానికి మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. ప్రతిరోజూ తీసుకొనే ఆహారంలో ఒక ఆకుకూర ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీడీపీఓ ప్రమీల మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి వెయ్యి రోజుల పాటు తీసుకునే సంరక్షణతోనే బిడ్డకు మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించినట్లు అవుతుందని వివరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ హెడ్ నర్స్ దిల్షాద్ డెంటల్ డాక్టర్ పల్లవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్య, గీతాంజలి, అనిత అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివునికి, నందీశ్వరునికి ఏక కాలంలో అభిషేకాలు చేస్తామని పేర్కొన్నారు.

ఐటీఐ పరీక్షలకు ప్రైవేటు విద్యార్థుల నుంచి దరఖాస్తులు

కార్వేటినగరం: ఐటీఐ పరీక్షలకు ప్రైవేటు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్ ట్రేడుల్లో ప్రైవేటుగా పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సీవోఈ, ఎస్‌సీవీటీ సంస్థల్లో అనుబంధ ట్రేడ్లలో ఐటీటీ పూర్తి చేసి ఫలితాల ప్రకటన తర్వాత కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలని, ఈ నెల 11వ తేదీ నాటికి 21 ఏళ్లు పూర్తయిన వారు ఏదైనా సంస్థలో మూడేళ్లు పనిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 12వ తేదీ లోపు తగిన ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సంప్రదించాలని, వివరాలకు 91600 12999, 91609 60999లో సంప్రదించాలని వెల్లడించారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



దీప్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కుమార్‌స్వామి రెడ్డి

విజయపురం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇల్లత్తూరు సర్పంచ్ దీప్తి కుటుంబాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామిరెడ్డి పరామర్శించారు. బుధవారం ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవలా రచయితకు సత్కారం



పేట యుగంధర్‌ను సత్కరిస్తున్న అతిథులు

వెదురుకుప్పం: తానా నవలల పోటీల్లో బాలసాహిత్య విభాగంలో బహుమతి అందుకున్న వెదురుకుప్పం గ్రామానికి చెందిన పేట యుగంధర్‌రెడ్డిని బుధవారం తిరుపతిలో జిల్లా రచయితల సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంస్కృత వర్సిటీ వీసీ జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి సత్కరించారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) నిర్వహించిన బాలల నవలల పోటీల్లో పేట యుగంధర్ రచించిన జాను అనే నేను, నా స్నేహితురాళ్లు అనే నవలలకు ప్రత్యేక పురస్కారం లభించింది. అలాగే రూ.15 వేలు నగదు బహుమతి కూడా అందజేశారు. కార్యక్రమంలో సాహితీ ప్రియులు ఆచార్య గొర్లపాటి దామోదర్ నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, టెంకాయల దామోదర్, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, డాక్టర్ మస్తానమ్మ పాల్గొన్నారు. యుగంధర్ రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయరెడ్డి, డీపీఎం పి.హరికృష్ణారెడ్డి అభినందించారు.

ఉపాధిలో పశుగ్రాసం పెంపకం



రామసముద్రంలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

వడమాలపేట (విజయపురం): ఉపాధి పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం చేసుకోవడానికి రైతులకు అవకాశం కల్పిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. ఉచిత పశుగ్రాసం పెంపకానికి పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మండలంలోని రామసముద్రంలో బుధవారం పశుగ్రాసం పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పది సెంట్లలో గడ్డి పెంపకానికి ఏడాదికి రూ.6,598, 50 సెంట్లలో రూ.32,992 ప్రభుత్వం అందిస్తుందన్నారు. మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల పాడిరైతులు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఉపాధి హామీ కార్డు, పాస్ బుక్, అడంగల్ కాపీలు, రైతు ఫొటోతో పాటు అందజేయాలన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం, పశువైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ లైజనింగ్ అధికారి లోకనాథం పాడిరైతులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ



అర్జీదారుడ్ని విచారిస్తున్న జేసీ శుభం బన్సల్

పుత్తూరు: ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ఫిర్యాదుల్లో పరిష్కరించిన వాటిపై తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పుత్తూరులోని కృష్ణానగర్‌లో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో అర్జీదారుని కలిసి విచారించారు. అర్జీదారుడు మణి పుత్తూరు రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబర్ 34/1ఎ లోని తన 2.24 ఎకరాల భూమి 22 ఏ జాబితాలో నమోదైనట్లు ఫిర్యాదు చేశారు. దీనిని పరిష్కరించినట్లు పుత్తూరు రెవెన్యూ అధికారులు కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపించారు. నిజనిర్ధారణ కోసం అర్జీదారుడి ఇంటి వద్దకు వచ్చిన జేసీ ఆరా తీశారు. సమస్య పరిష్కారమైనట్లు అర్జీదారుడు తెలిపారు. జేసీ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ అశోక్‌రెడ్డి, సర్వేయర్ శేషమరాజు, ఇన్‌చార్జి ఆర్ఐ గురుస్వామి, వీఆర్‌ఓ అరుణ ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న రోజారమణి

వడమాలపేట (విజయపురం): మండల పరిధిలోని టీసీ అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ రోజారమణి ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచే మంచి పౌష్టికాహారం తీసుకున్నట్లయితే ఎత్తుకు తగిన బరువు కలిగి ఉంటారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు చిరుధాన్యాలు తీసుకుంటే రక్తహీనత లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయురాలు పార్వతి, లక్ష్మీకాంత, సిబ్బంది రేవతి, చంద్రకళ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లలో కోత?



ఏరియా ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

విజయపురం: పింఛన్‌దారుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం కనికరం చూపడంలేదు. సాధ్యమైనంత వరకు పింఛను రద్దు చేయడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం విజయపురం మండలానికి చెందిన 70 మంది దివ్యాంగుల వైకల్యాన్ని పరిశీలించేందుకు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమ కుటుంబానికి సంబంధించిన వ్యక్తులను తరలించడానికి తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరిలో ఎంతమంది పింఛన్లలో కోత పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

నగరి: కూటమి ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పవిత్ర ఉషారాణి డిమాండ్ చేశారు. నగరి అర్బన్ యూపీఎస్ కొత్తపేట, సత్రవాడలో బుధవారం వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. లేకుంటే ఆశాల సమస్యలపైన రాష్ట్ర వ్యాప్తంగా మరోమారు ఉధృతమైన ఉద్యమాన్ని చేపట్టాల్సింది వసుందన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ జిల్లా సహాయ కార్యదర్శి పవిత్ర, నాయకులు మమతా ప్రియ, మీనా, నీరజా, గీతా, రుక్మిణీ, ఆశాలు పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటు



లక్ష్మయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు టీ.లక్ష్మయ్య(74) మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. లక్ష్మయ్య మృతి విషయం తెలుసుకున్న నారాయణస్వామి బుధవారం కార్వేటినగరం పెద్ద దళితవాడకు చేరుకున్నారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ లతాబాలాజీ, కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చందురాజు, ఎంపీటీసీ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఉపసంహరించకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. గాంధీవిగ్రహం వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అధికారం కోసం బీజేపీ ప్రభుత్వం పలు హామీలనిచ్చి అమలు చేయడం మరిచిందన్నారు. ధరలు పెంచమని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, రైతులకు రెట్టింపు ఆదాయం తెస్తామని అనేక హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. సంస్కరణల పేరుతో కరెంటు చార్జీలు పెంచారని గుర్తుచేశారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై మరింత భారం వేస్తున్నారని చెప్పారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలు అభ్యంతరం తెలపకపోవడం సరికాదన్నారు. దీనిపై ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



డీఎం పురంలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు



సురేంద్రనగరంలో పేడ దిబ్బలను తొలగిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి కే.సుధాకర్‌రావు ఆదేశించారు. ఆయన బుధవారం కార్వేటినగరం, సురేంద్రనగరం పంచాయతీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించి పారిశుద్ధ్య లోపించకుండా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలన్నారు. అనంతరం రోడ్లపై వేసిన పేడ దిబ్బలను జేసీబీలతో తొలగించారు. అలాగే డీఎంపురం గ్రామంలో ఉన్న ప్రంట్ ఆఫ్ ఆయుష్ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అలాగే ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చిన వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. డీఎంపురం చెత్తసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్వేటినగరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనుంజయవర్మ, పెరియస్వామిరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ, కార్యదర్శులు హరికృష్ణ, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

తరగతుల విలీనం వద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

నగరి: ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులు హైస్కూళ్లలో విలీనం చేయరాదని అందుకు సంబంధిత జీవోను రద్దుచేయాలని కోరుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు ఎమ్మెల్యే గాలిభాను ప్రకాష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 3,4,5 తరగతులను విలీనం చేసే జీవో 117ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దుచేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని దానిని నెరవేర్చాలన్నారు. విలీనం చేస్తే ప్రభుత్వ విద్యారంగం పెద్దఎత్తున నష్టపోతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్, రాష్ట్ర కౌన్సిలర్ పిఆర్ మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ కే.వంశీకృష్ణ, నగరి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, సంతోష్ కుమార్, విజయపురం మండలం అధ్యక్షులు శ్రీనివాసులు, నింద్ర మండలం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు జనార్దన్, యువరాజు, సురేష్ బాబు, వెంకటేశులు, సురేష్, టిఎన్ జనార్దన్, ఎంజి సురేష్, మణిగండన్, అరుణ, సుహాసిని, పుష్ప, సుజాత, కన్నియప్పన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో ప్రయాణం ప్రమాదకరం



ట్రాక్టర్లలో ప్రయాణిస్తున్న మహిళలు

కార్వేటినగరం: ట్రాక్టర్లలో ప్రయాణం ప్రమాదకరమని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన కొల్లాగుంట చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు ట్రాక్టర్లలో ప్రయాణికులను తరలిస్తుండడాన్ని గుర్తించారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని నగరి వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాక్టర్లలో ప్రయాణం ప్రమాదకరమని, మలుపుల్లో అదుపుతప్పి బోల్తాపడే అవకాశం ఉందని తెలిపారు. గత నెల శ్రీరంగరాజపురం మండలం పాదలపల్లి వద్ద జరిగిన ఘటనలో 45 మందికి తీవ్రంగా గాయపడ్డారని గుర్తుచేశారు. ట్రాక్టర్లలో ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

రోడ్డుపైకి చేరిన రసాయన నీరు



నగరి: మున్సిపల్ పరిధి కొత్తపేటలో డైయింగ్ యూనిట్ నుంచి వచ్చిన రసాయన నీరు వీధుల్లో పారడం చర్చనీయాంశమైంది. ఒకవైపు మున్సిపల్ అధికారులు మిషన్ డైయింగ్ యూనిట్లు అన్నీ మూసేశామని చెబుతున్నారు. అందులో 8 యూనిట్లు లాక్ చేశామంటున్నారు. ఈ క్రమంలో డైయింగ్ యూనిట్ నుంచి రోడ్డుపై నీరు వచ్చింది. దీంతో ఎవరైనా రాత్రి పూట యూనిట్లు నడుపుతున్నారా అనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమైంది. దీనిపై ఆరాతీయగా మాన్యువల్ డైయింగ్ యూనిట్లు పనిచేస్తుండడంతో ఆ నీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపైకి వచ్చినట్లు తేల్చారు. సీఈటీపీని నడిపితే ఇలాంటి సమస్యలు రావని స్థానికులు తెలుపుతున్నారు.

ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్ తొలగింపు



ఫెన్సింగ్‌ని తొలగిస్తున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: మండలంలోని తిరుమళరాజుపురంలో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని వేసిన ఫెన్సింగ్‌ను బుధవారం తహసీల్దార్ అరుణ కుమారి తమ సిబ్బందితో కలిసి తొలగించారు. ఆమె మాట్లాడుతూ తిరుమళరాజుపురం రోడ్డు పక్కన సర్వే నంబర్ 66లో 1.08 సెంట్ల భూమిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడన్నారు. దాని పక్కన వున్న ప్రభుత్వం భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశాడన్నారు. స్థానికుల సమాచారంతో ఫెన్సింగ్‌ను తొలగించినట్టు తెలిపారు. అలాగే ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆవుల షెడ్డును కూడా తొలగించామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, మండల సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.